నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, గురువారం 22 ఫిబ్రవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY


వరి చేను ఎండిపోవడంతో దిక్కుతోచని స్థితిలో కూర్చున్న రైతు సాయికుమార్

నాలుగు బోర్లు వేసినా చుక్కనీరు పడలే

ధన్వాడ, ఫిబ్రవరి 21 : ధన్వాడ మండలంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. మండలంలోని గున్ముక్ల చెరువులో తప్పా ఏ ఒక్క చెరువులో నీరు కనిపించడం లేదు. ఎంనోనిపల్లి గ్రామంలో సాయికుమార్ అనే రైతు బోరు కింద వరి పంటను సాగు చేశాడు. అయితే బోరులో నీరు ఇంకిపోవడంతో పంట ఎండిపోతున్నది. దీంతో పంటను ఎలాగైనా కాపాడుకోవాలని అప్పు చేసి తన పొలంలో నాలుగు చోట్ల బోరు వేయించాడు. అయినా చుక్క నీరు కూడా పడకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. పంట చేతికి రాకపోవడమే కాకుండా చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసికంగా కుంగిపోతున్నాడు.


జూరాలలో 0.808 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉండడంతో బ్యాక్‌వాటర్‌లో తేలిన నేల

- ఉమ్మడి జిల్లాలో కరువుఛాయలు
- అట్టడుగుకు ప్రాజెక్టుల నీటిమట్టం
- ఎత్తిపోతలకు నిలిచిన నీటిపంపింగ్
- ఎంజీకేఎల్ఐ ఆయకట్టు ప్రశ్నార్థకం

ఎండుతున్న పైర్లు

- జూరాల ప్రాజెక్టు కింద క్రాప్‌హాలిడే
- ఆర్డీఎస్ కింద కూడా అదే పరిస్థితి..
- నెట్టెంపాడ్ పరిధిలో కేవలం ఐదు వేల ఎకరాల సాగుకు ప్రతిపాదనలు
- కొన్ని చోట్ల నీరందక ఎండిన పైర్లు
- బీళ్లుగా దర్శనమిస్తున్న పొలాలు

గద్వాల, ఫిబ్రవరి 21 : వానకాలంలో వర్షాలు సమృద్ధిగా కురువకపోవడంతో ఈ ఏడాది జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండలేదు. దీనికితోడు ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి కూడా నీరు రాకపోవడంతో యాసంగి సీజన్‌లో జూరాల ప్రాజెక్టు కింద అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించారు. వాస్తవంగా జూరాల కుడి కాల్వ ద్వారా 35,657 ఎకరాలు, ఎడుమ కాల్వ ద్వారా 69,084 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా.. ఏనాడూ పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరు అందలేదు. వానకాలం సీజన్‌లో జూరాల కుడి కాల్వ కింద 29,592 ఎకరాలకు సాగునీరు విడుదల చేశారు. ప్రస్తుతం జూరాలలో ఉన్న నీరు తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతుండడంతో యాసంగికి నీరు నిలిపివేశారు. జూరాల నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.808 టీఎంసీలు మాత్రమే ఉన్నది. దీనిపై ఆధారపడ్డ నెట్టెంపాడు ప్రాజెక్టు కింద 1.42 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా ర్యాలంపాడ్ రిజర్వాయర్‌కు బుంగలు పడడంతో నాలుగు టీఎంసీలు నింపాల్సిన చోట కేవలం 1.5 టీఎంసీలను మాత్రమే నింపారు. ఈ ఏడాది అందులో కూడా నీటి నిల్వ లేకపోవడంతో కేవలం ఐదు వేల ఎకరాల సాగుకు మాత్రమే అధికారులు ప్రతిపాదనలు పంపారు. గత వానకాలం సీజన్‌లో నెట్టెంపాడ్ ప్రాజెక్టు కింద 1,12,925 ఎకరాలకు సాగు నీరందించారు. ప్రస్తుతం బోరు బావుల కింద మాత్రమే రైతులు పంటలు సాగు చేశారు. మిగతా పొలాలన్నీ బీడుగా దర్శనమిస్తున్నాయి. జూరాల కాల్వలో నీరు తగ్గిపోవడంతో మిరప, ఆలసంద పంటలు కూడా పూర్తిగా ఎండిపోయాయి.

ఆర్డీఎస్ ప్రాజెక్టు పరిధిలో..

ఆర్డీఎస్ ప్రాజెక్టు కింద వాస్తవంగా 87,500 ఎకరాలకు సాగునీరందాల్సి ఉండగా.. 31,900 ఎకరాలకు మించి ఎన్నడూ సాగునీరు అందలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్డీఎస్ చివరి ఆయకట్టుకు నీరు అందించాలనే ఆలోచనతో ముందడుగు వేశారు. డీ-24 నుంచి డీ-40 వరకు ఉన్న 55,600 ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పూర్తి చేసి 2018 నుంచి సాగునీరు అందించారు. గత వానకాలం సీజన్‌లో తుమ్మిళ్ల లిఫ్ట్ కింద 35,997 ఎకరాలు సాగయ్యాయి. ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో ఆర్డీఎస్ ప్రాజెక్టు ఎండిపోవడం, తుంగభద్ర డ్యాంలో నీరు లేకపోవడంతో ఆర్డీఎస్, తుమ్మిళ్ల ప్రాజెక్టుల కింద కూడా అధికారులు క్రాప్‌హాలిడే ప్రకటించారు. ఆర్డీఎస్ కాల్వకు గతేడాది మార్చి చివరి నాటికి నీరు విడుదలయ్యాయి. అయితే, ఈ ఏడాది ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో రెండు నెలలుగా కాల్వలకు నీటిని బంద్ చేశారు. దీంతో ఆర్డీఎస్ కింద రైతులు సాగు చేసిన పంటలు నీరు అందక ఎండిపోయాయి. బోరుబావుల కింద తప్పా ఎక్కడ చూసినా బీడు భూములే దర్శనమిస్తున్నాయి.


భీమా కాల్వ నీళ్లు పారక నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో నెర్రెలు బారిన వరి పొలం

నీళ్లు.. నిలే,

పాలమూరు జిల్లా ఎండుతోంది. జలం జరిలమై పాతాళానికి చేరింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నీటితో జలకళను సంతరించుకున్న ప్రాజెక్టులు నేడు అట్టడుగు నీటిమట్టంతో కళావిహీనంగా తయారయ్యాయి. రిజర్వాయర్లు, కాల్వలు ప్రవాహం లేక వెలవెలబోతున్నాయి. దీంతో సాగు సందిగ్ధంగా మారింది. రైతుల కల్పతరువైన జూరాల, ఆర్డీఎస్ ప్రాజెక్టుల కింద ఇప్పటికే అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించారు. ఎత్తిపోతలకు నీటి పంపింగ్ నిలిచింది. ఎంజీకేఎల్ఐ ఆయకట్టు ప్రశ్నార్థకమైంది. దీనికి తోడు కరెంట్ కోతలు రైతును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. యాసంగి సాగు అయోమయంగా మారగా.. విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. మొన్నటి దాకా మాగాణుల్లా దర్శనమిచ్చిన పొలాలు నేడు నెర్రెలు బారాయి. బోర్లు, బావులు ఒట్టిపోగా.. సాగైన వివిధ పంటలు నీళ్లులేక ఎండిపోయి పశువుల పాలయ్యాయి. మునపటి రోజులు మళ్లీ దాపురించాయని కర్షకులు ఆందోళన చెందుతున్నారు. వేసవి ప్రారంభంతో తాగునీటికి సైతం కష్టాలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

- మహబూబ్‌నగర్ (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ నాగర్‌కర్నూల్(నమస్తే తెలంగాణ)/గద్వాల, ఫిబ్రవరి 21

- యాసంగిలో తగ్గిన సాగు విస్తీర్ణం
- నెర్రెలు బారుతున్న పొలాలు
- ఎండిన పంటలు పశువుల పాలు
- ఆందోళన చెందుతున్న రైతన్నలు
- తాగునీటికీ కష్టమంటున్న అధికారులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో యాసంగి సాగు డేంజర్‌లో పడింది.. వర్షాభావం వెంటాడుతున్నా ఆశతో సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారుతున్నది.. రోజురోజుకు అడుగంటుతున్న జలశయాలతో రైతులు కుదేలవుతున్నారు.. పంటలను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు.. జూరాల, కోయిల్‌సాగర్‌తోపాటు ఇతర జలశయాల్లో ఉన్న కొద్ది పాటి నీటిని తాగునీటి కోసం రిజర్వు చేసే పరిస్థితులు రావడంతో పంటలు చేతికొచ్చే పరిస్థితి కానరావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. మరోవైపు జీవనది అయిన కృష్ణమ్మ ఇటు జూరాల, శ్రీశైలం ఎగువ ప్రాంతాల్లో వేగంగా నీటి నిల్వలు అడుగంటుతున్నాయి.. ఈసారి ఎండాకాలంలో కూడా నీటి ఎద్దడి తప్పేలా కనిపించడం లేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జూరాల, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, సంగంబండ, భూత్పూర్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద నిర్మించిన జలశయాల్లో నీళ్లు అడుగంటిపోతున్నాయి. గత నెలలో జూరాల, సంగంబండ, కోయిల్‌సాగర్ కింద ఆయకట్టుకు సాగునీరును విడుతల వారీగా అందించేలా ఒప్పందం కుదిరింది. ఇప్పుడు చివరి విడుత నీరు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మరోవైపు జీవనది అయిన కృష్ణానదిలో ఈసారి కర్ణాటక నుంచి వచ్చే కొద్దిపాటి ప్రవాహం కూడా ఆగిపోయింది. మరోవైపు తుంగభద్ర నదిపై నిర్మించిన ఆర్డీఎస్ పరిస్థితి దారుణంగా తయారైంది. దీంతో ఈసారి యాసంగి పంటలు చేతికి వస్తాయా? లేదా అనే ఆందోళన అన్నదాతల్లో కనిపిస్తున్నది. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగు విస్తీర్ణం భారీగా పడిపోయింది. గతేడాది యాసంగికి మహబూబ్‌నగర్ జిల్లాలో 1.50 లక్షల ఎకరాలు సాగు చేయగా ఈసారి 60 వేల ఎకరాలకు మించడం లేదు. బోరు బావుల కింద సాగు చేసిన పంటల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇదే పరిస్థితి కొనసాగితే మళ్లీ పాలమూరు నుంచి వలసలు తప్పేలా లేవని హెచ్చరిస్తున్నారు. పదేండ్లుగా కేసీఆర్ ప్రభుత్వంతో పచ్చబడిన పాలమూరు జిల్లా ఈసారి ఎండిపోతున్నది. నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాలో వరి పంట నీళ్లు లేక నెర్రెలు బారుతున్నాయి. గత తొమ్మిదేండ్లుగా ఈ పరిస్థితి ఎన్నడూ చూడలేదని రైతులు అంటున్నారు. చెరువులు, కుంటల వద్ద ఉన్న కొద్దిపాటి పంటలు మాత్రమే చేతికి వచ్చేలా కనిపిస్తున్నాయి. బోర్ల దగ్గర ఉన్న పంటలపై ఆశలు వదులుకునేలా పరిస్థితులు ఉన్నాయి. రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటి పోతుండడంతో పాత బోర్లను రిపేరు చేయిస్తున్నారు. దీంతోనే ఖర్చు తడిసి మోపడవుతున్నది. మరోవైపు పంటలు కండ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులు పంటలను పశువుల మేతకు వదులుతున్నారు. ఇదే పరిస్థితి మరో 20రోజులు కొనసాగితే పంటలన్నీ పూర్తి ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఏడాది తాగునీటికీ కష్టాలు తప్పవని అధికారులు ఇప్పటినుంచే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలోని సంగంబండ, మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్‌లో కేవలం ఒకటిన్నర టీఎంసీల నీళ్లే అందుబాటులో ఉన్నాయి. కోయిల్‌సాగర్ జలాశయం నుంచి మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు తాగునీటిని ప్రత్నామ్నాయంగా అందించే వెసులుబాటు ఉన్నది. దీంతో రైతుల పరిస్థితి ఒకలాగా ఉంటే.. ఎండాకాలంలో నీటి ఎద్దడి తీవ్రతరం అయితే పరిస్థితి ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు.

కళ తప్పిన ప్రాజెక్టులు

నీళ్లు లేక అడుగంటిన గుడిపల్లి రిజర్వాయర్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ) : నాగర్‌కర్నూల్ జిల్లాలో సాగు దాదాపు సగానికి పడిపోయింది. గత పదేండ్లలో లేని విధంగా యాసంగి సాగు తగ్గిపోవడం గమనార్హం. గతేడాది వానకాలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో ఎగువన కృష్ణానదికి వరదలు రాలేదు. ఫలితంగా కృష్ణానది నీటి ఆధారంగా నిర్మించిన మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంపై ప్రభావం పడింది. శ్రీశైలం బ్యాక్‌వాటర్ ఆధారంగా నిర్మించిన కల్వకుర్తి ప్రాజెక్టు పరిధిలో జిల్లాలో రైతన్నలు సాగు చేస్తున్నారు. గత సీజన్‌లో జిల్లాలో 3,12,096 ఎకరాల విస్తీర్ణంలో పంటల సాగు చేశారు. ఈ సీజన్‌లో రైతులు నీటి లభ్యత దృష్ట్యా పంటల సాగును తగ్గించారు. దీనివల్ల ఈ సీజన్‌లో జిల్లాలో 3,15,919 ఎకరాల్లో పంటల సాగు జరుగుతుందని అంచనా. కాగా, ఇప్పటి వరకు అధికారుల అంచనా ప్రకారం 2,20,959 ఎకరాల్లో మాత్రమే పంటల సాగు చేస్తుండగా దాదాపుగా లక్ష ఎకరాల విస్తీర్ణం తగ్గడం గమనార్హం. శ్రీశైలం రిజర్వాయర్‌లో కృష్ణానదీ జలాల మట్టం బాగా తగ్గిపోవడంతో కల్వకుర్తి ప్రాజెక్టుకు నీటి విడుదల నిలిచిపోయింది. గతేడాది మార్చి చివరి వరకూ నీళ్లు విడుదల చేయగా ఇప్పుడు డిసెంబర్ నుంచే అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. రైతుల పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడడంతో ఒకట్రెండు సార్లు నీటిని విడుదల చేశారు. కాగా శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరాయి. వానకాలంలో వానలు, వరదలు లేకపోవడంతోపాటుగా గతంలో జరిగిన విద్యుదుత్పత్తికితోడు ప్రస్తుతం ముచ్చుమర్రి ద్వారా నీటిని సీమకు ప్రతిరోజూ తరలిస్తుండడంతో ప్రస్తుతం రిజర్వాయర్ 817 అడుగులకు చేరుకోగా 38 టీఎంసీల నీళ్లే నిల్వ ఉన్నాయి. దీనివల్ల కల్వకుర్తి పరిధిలో ఆయకట్టు భవిత ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో 4లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు ఇప్పుడు 2.50లక్షల ఎకరాలకు నీటిని అందించలేకపోతుంది. చాలా వరకు చెరువులు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. చిన్నచిన్న కుంటలుగా మారాయి. మండలంలోని మంతటి చెరువు కింద గత సీజన్‌లో 200 ఎకరాల సాగు ఉండగా ఈసారి కేవలం 20ఎకరాల వరకే సాగు జరిగింది. ఇక కల్వకుర్తి పరిధిలోని గుడిపల్లి రిజర్వాయర్‌లో నీటి మట్టాలు సైతం అడుగంటాయి. రాళ్లు, మట్టి తేలింది. గతేడాది ఈ సమయంలో నిండు కుండలా ఉన్న రిజర్వాయర్ ఇప్పుడు బోసిపోయింది. సమీపంలోని రైతులు వరి పొలాలకు నీళ్లు లేక రిజర్వాయర్‌లో మోటర్లను ఏర్పాటు చేసుకొని కాల్వలకు పారించి, అక్కడి నుంచి మోటర్లతో నీళ్లను తోడుకొంటున్న దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ఇలా రిజర్వాయర్లు, చెరువుల్లో నీళ్లు లేక రైతులు ఈ సీజన్‌లో పంటల సాగును భారంగా చేపడుతున్నారు. జిల్లాలో వరిపంట 1,63,331 ఎకరాల్లో సాగు చేస్తారని భావిస్తుండగా ఇప్పటి వరకు అధికారుల అంచనా మేరకు 85,367ఎకరాల్లో మాత్రమే సాగు జరిగింది. బోరు బావులపై ఆధారపడిన రైతులే పంటలకు విడుతల వారీగా తడి పెట్టుకొంటూ కాపాడుకుంటున్నారు. పంట చేతికి వచ్చే వరకు ప్రస్తుతం కాపాడుకుంటూ వస్తున్న పరిస్థితులు చేయి దాటుతాయేమోననే భయం రైతన్నల్లో కనిపిస్తోంది. జిల్లాలో ఒక్క వేరుశనగ మినహాయిస్తే పత్తి, జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, కందులు అంచనాలకంటే తక్కువగా సాగు చేపట్టడం ప్రస్తుత వ్యవసాయ స్థితిని తెలియజేస్తున్నది. మొత్తం మీద గత పదేండ్లలో ఎన్నడూ లేనంతగా పంటల సాగు తగ్గిపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

నీళ్లు లేక తగ్గిన సాగు..

జిల్లాలో యాసంగి లో పంటల సాగు తగ్గింది. గత 2022లో 3.12లక్షల ఎకరాల్లో సాగు జరిగితే ఈసారి ఇప్పటి వరకు 2.20లక్షల ఎకరాల సాగు చేశారు. కల్వకుర్తి ప్రాజెక్టులో నీళ్లు లేకపోవడంతో చెరువులు, కుంటల కింద ఆయక్టటుపై కూడా ప్రభావం పడింది. బోర్లున్న రైతులు పంటలకు తగిన మోతాదులో తడి ఇస్తూ రక్షించుకుంటున్నారు.

- వెంకటేశ్వర్లు, డీఏవో, నాగర్‌కర్నూల్ జిల్లా

పెట్టుబడి కూడా వస్తుందో.. లేదో..

ఇరిగేషన్ అధికారులు సాగునీరందక క్రాప్ హాలిడే ప్రకటించడంతో బోర్ కింద కొంత మేరకు పంట సాగు చేశాను. బోరు నుంచి సరిపడినంత నీరు రావడంలేదు. పంట ఎండుతున్నది. పెట్టుబడి కూడా వస్తుందో లేదో అనే పరిస్థితి నెలకొన్నది.

- సిద్ధయ్యగౌడ్, రైతు, మాన్‌దొడ్డి గ్రామం, రాజోళి మండలం, జోగులాంబ గద్వాల జిల్లా

నీటి భయంతో సాగు చేయలే..

సింగవట్నం శ్రీవారి సముద్రం రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఉన్న నీటిని రానున్న వేసవిలో పశువులకు తాగునీటి అవసరాల కోసం నిల్వ చేశారు. తాము ఒక వేళ ఆయకట్టు కింద వరి సాగు చేస్తే నీటి సమస్య తలెత్తుతుందని భావించి రైతులందరం క్రాప్ హాలిడేను ప్రకటించుకున్నాం. ఆయకట్టు కింద నాకు అరెకరం ఉన్నది. పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేక సాగు పెట్టుబడులు మీద పడి అప్పులపాలుకావొద్దని భావించి యాసంగిలో సాగు చేయలేదు.

- నర్సింహ, రైతు, ఎన్నన్‌బెట్ల గ్రామం, కొల్లాపూర్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

పాత రోజులు గుర్తుకొస్తున్నాయి..

ఆరేండ్లలో కరువు అనేదే లేదు. నాకున్న పది ఎకరాల్లో యాసంగి, వానకాలం పంటలు సాగుచేసి మంచిగా బతికేవాళ్లం. వర్షాలు సరిగా లేనందున యాసంగిలో నాలుగున్నర ఎకరాలు మాత్రమే వరి సాగుచేస్తున్నాను. ఉన్న రెండు బోర్లల్లో నీళ్లు తగ్గిపోవడంతో రెండున్నర ఎకరాలు వదిలేసి.. రెండెకరాలు మాత్రమే నీళ్లు పారిస్తున్నా. పంట పూర్తి అయ్యేదాకా రెండెకరాలకు సరిపడా బోరులో నీళ్లు వస్తాయో.. రావో అని అనుమానంగా ఉన్నది. మా గ్రామంలో ఇప్పటికే చాలా బోర్లలో నీళ్లు తగ్గిపోయాయి. కొత్తవి వేస్తే తక్కువ నీళ్లు వచ్చాయి. కొన్ని ఫెయిల్ అయ్యాయి. నేను కూడా బోరు వేద్దామంటే నీళ్లు పడతాయో లేదోనని భయంగా ఉన్నది. వర్షాలు సమృద్ధిగా కురవక, ప్రాజెక్టులకు నీళ్లు రాకపోవడంతో మళ్లీ పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి.

- కే రవీందర్, రైతు, దొడగుంటపల్లి గ్రామం, పెద్దమందడి మండలం, వనపర్తి జిల్లా

మెట్టినింటికి చేరిన జములమ్మ

పూజలు చేస్తున్న అర్చకులు

గద్వాల రూరల్, ఫిబ్రవరి 21 : నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ బుధవారం జమ్మిచేడులోని మెట్టినింటికి చేరింది. మాఘ శుద్ధ పౌర్ణమి నుంచి భక్తులకు అభయమివ్వాల్సిన జములమ్మ తన తల్లిగారి ఇంటి (గుర్రంగడ్డ)నుంచి బుధవారం మెట్టినింటికి (జమ్మిచేడు) బయలుదేరింది. మంగళవారం అమ్మవారిని తీసుకురావడానికి సారెతో ఎద్దుల బండి వెళ్లింది. సాయంత్రానికి గుర్రంగడ్డకు చేరుకున్న తర్వాత అక్కడ అమ్మవారికి పూజలు చేశారు. రాత్రి అవుతుండగానే జములమ్మను కృష్ణానదిలో పుట్టి ద్వారా బయటికి తీసుకువచ్చారు. అక్కడ ఎద్దులబండిపైన అమ్మవారిని కూర్చొబెట్టి భాజా భజంత్రీలతో బీరెల్లి, లత్తీపురం, వెంకటోనిపల్లి మీదుగా తెల్లవారుజామున నాలుగు గంటలకు జమ్మిచేడుకు చేరుకున్నది. ఆయా గ్రామాల్లో అమ్మవారికి ప్రజలు హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు ఆలయానికి చేరిన తర్వాత ఆలయ చైర్‌పర్సన్ గాయత్రి, ఈవో పురేందర్ ఆధ్వర్యంలో అమ్మవారిని స్వాగతించి ఆలయంలోకి చేర్చి పూజలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఆయన సతీమణి బండ్ల జ్యోతి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు కాంబ్లె, జానకీరాములు, అభిలాష్, రాము, శంకర్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో

న్యాక్ బృందం పరిశీలన

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 21 : జడ్చర్లలోని డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం న్యాక్ బృందం పరిశీలించింది. న్యాక్ బృందం చైర్మన్, కర్ణాటక హసన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ తారనాథ్ నేతృత్వంలో సభ్యులు వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ జైచంద్రారెడ్డి, అస్సోం రాష్ట్రానికి చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బిమల్ బరాహ్ జోర్హట్, తెలంగాణ ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్ పర్యటించారు. న్యాక్‌బృందం కళాశాలలో అన్ని విభాగాలను పరిశీలించి విద్యాబోధనలు, సదుపాయాలను గురించి ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పీయ చిన్నమ్మను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత పూర్వ విద్యార్థులు, పేరెంట్స్ కమిటీలతో పాటు ప్రస్తుత విద్యార్థులతో వేర్వేరుగా సమావేశమై కళాశాల స్థితిగతులను తెలుసుకున్నారు. అయితే కళాశాలలోని సదుపాయాలు, విద్యబోధనలపై న్యాక్‌బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను న్యాక్ బృందం తిలకించి విద్యార్థులను అభినందించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వస్త్రదుకాణం దగ్ధం

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 21 : షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధమైన ఘటన బుధవారం ఉదయం జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. జిల్లా కేంద్రంలోని చిన్నఅగ్రహారం రోడ్డులో బుధవారం ఉదయం ఒక వస్త్ర దుకాణంలో షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.80 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు దుకాణ నిర్వాహకులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని దుకాణ నిర్వాహకులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ కేశవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు రామన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఇద్దరు బాలికల అదృశ్యం

- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 21 : ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటన వనపర్తి జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు.. వనపర్తి జిల్లా కేంద్రంలోని పాతబజారుకు చెందిన ఇద్దరు బాలికలు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. మంగళవారం పాఠశాలకు వెళ్లి.. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు స్కూల్‌కు వెళ్లి ఆరాతీశారు. పాఠశాలకు రాలేదని సిబ్బంది చెప్పగా.. చుటుపక్కల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో అదే రోజు రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఆధ్వర్యంలో పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. గాంధీచౌక్, అంబేద్కర్ చౌక్, రాజీవ్‌చౌక్, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా.. కొత్త బస్టాండ్ వద్ద కర్నూల్ బస్సు ఎక్కినట్లు గుర్తించారు. మన్యంకొండ కూతురు వైపావని మెరూన్ కలర్ దుస్తులు ధరించి తెల్లని క్యా రీబ్యాగ్ పట్టుకున్నదని, నాగేశ్వర్ కూతురు తోకల మౌనిక స్కై బ్లూ డ్రెస్ ధరించి స్కూల్ బ్యాగుతో వెళ్లిందని.. ఇద్దరూ 12 ఏండ్లలోపు బాలికలేనని, ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.